ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

శుక్రవారం 13 డిసెంబరు 2024



## న్యూస్ బాక్స్

### చందుర్తి ఎస్సైగా అంజయ్య



చందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చందుర్తి ఎస్సైగా అంజయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన శ్రీకాంత్ జిల్లా హెడ్ క్వార్టర్లకు బదిలీ కాగా దాదాపు నాలుగు నెలలుగా చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పోస్టు ఖాళీగా ఉంది. వేములవాడ టౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న అంజయ్యను చందుర్తికి బదిలీ చేస్తూ ఇటీవల ఎస్పీ ఉత్తర్వులు జారీ చేయగా బాధ్యతలు చేపట్టారు.

### ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేటలోని పురాతన శివాలయంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వేద పఠనం, గణపతిపూజ, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, 14న మహాలింగార్చన, రాజోపచార పూజ, 15న యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను జరుపనున్నామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సభ్యులు కోరారు.

# ఉత్తమ ఫలితాలకు యాక్షన్ ప్లాన్

- ఇంటర్ ఫలితాల కోసం 90 రోజుల ప్రణాళిక
- విద్యార్థులకు ఒత్తిడిపై కౌన్సెలింగ్
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక కార్యాచరణ
- వెనకబడుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- జిల్లాలో 8,190 మంది విద్యార్థులు



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా విద్యాశాఖ దృష్టి సారించింది. మూడు నెలల సమయం మాత్రమే పరీక్షలకు ఉండడంతో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టే విధంగా ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. దీంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలో అన్ని కళాశాలల్లో ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో చర్యలు చేపట్టారు. డిసెంబరు చివరి నాటికి సిలబస్ ప్రక్రియ పూర్తిచేసి ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు, వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించే దిశగా చర్యలు చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సైతం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పిలిచి మాట్లాడుతున్నారు. విద్యార్థుల స్థాయిని అంచనా వేసి వారికి అందించాల్సిన చర్యలతో పాటు ఇతర విద్యార్థులతో పోటీపడే విధంగా బోధన అందించనున్నారు. ఇందుకోసం 90రోజుల ప్రణాళికలను అమలు చేయనున్నారు. ప్రధానంగా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చే విధంగా ఇద్దరు అధ్యాపకులను ప్రతి కళాశాలలో కౌన్సెలర్లుగా నియమించనున్నారు. అవసరమైతే సైకాలజిస్టుల సేవలను కూడా అందించనున్నారు.

**● గత విద్యా సంవత్సరంలో 16వ స్థానం**

రాజన్నసిరిసిల్ల జిల్లా గత 2023-2024 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి సంవత్సరం 13వ స్థానంలో రెండో సంవత్సరంలో 16వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం జనరల్ ఇంటర్‌లో 57.79 శాతం, ఒకేషనల్‌లో 47.73 శాతం రెండో సంవత్సరంలో జనరల్ ఇంటర్‌లో 65.5 శాతం, ఒకేషనల్‌లో 63.1 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండు సంవత్సరాలు కలిపి 6,722 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 4,130 మంది..

**● 33 కళాశాలలు..**

జిల్లాలో 33 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వజూనియర్ కళాశాలలు 10, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలు ఏడు, గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలు, ఫైన్ ఆర్ట్స్ కళాశాలు నాలుగు, మైనార్టీ సంక్షేమ జూనియర్ కళాశాలలు రెండు, బీసీ సంక్షేమ జూనియర్ కళాశాలలు రెండు, తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలలు ఒకటి ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2490 మంది విద్యార్థులు ఉన్నారు. మిగతా 5,600 మంది విద్యార్థులు గురుకులాలు, సంక్షేమ జూనియర్ కళాశాలల్లో ఉన్నారు. వీరందరికి 90రోజుల ప్రత్యేక తరగతులను నిర్వహించి జిల్లాను ఉత్తీర్ణత శాతంలో ముందుకు తీసుకువెళ్లనున్నారు.

మిగతా 8లో..

## ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

బహుమతులు అందజేసిన అతిథులు



లాంగ్ జంప్ జేస్తున్న విద్యార్థిని

8

## ముగిసిన గీతా జయంతి ఉత్సవాలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు

7



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

## గ్రూప్ - 2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్య**



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, చిత్రంలో ఏఎస్పీ చంద్రయ్య

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్య అధికారులను ఆదేశించారు. గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అబ్జర్వర్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెంటెండ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, లోకల్ రూట్ ఆఫీసర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. పరీక్ష కేంద్రంలో నిర్వర్తించాల్సిన విధులపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ ఆదేశాల మేరకు జిల్లాలో ఆదివారం, సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. 7,163 మంది పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు. ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని స్పష్టం చేశారు. జిల్లాలో 26 కేంద్రాలు ఉండగా ఉదయం 9.30 గంటల తరువాత, మధ్యాహ్నం 2.30 గంటల తరువాత అభ్యర్థులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పరిశుభ్రత పనులు చేయించాలని, సెస్ అధికారులు కరెంట్ సరఫరాలో లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒక రోజు ముందే తమ పరీక్ష కేంద్ర చిరునామా సరిచూసుకోవాలని పేర్కొన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఉన్నందున అభ్యర్థులు పరీక్ష రోజు నిర్దేశించిన సమయాని కంటే ముందే చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ గుర్తింపుకార్డులు మినహా ఏమీ వెంట తీసుకురావద్దని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు, జేఎన్టీయూ అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఆయుష్మాన్ హెల్త్‌కార్డుల నమోదుపై అవగాహన

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో గురువారం డీఎంహెచ్‌వో వసంతరావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. సమీక్ష సమావేశంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డుల ఆన్‌లైన్‌లో నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో వసంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఆయుష్మాన్ హెల్త్ కార్డు ద్వారా 16 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకు ఆరోగ్య మందిర్‌లో ఆయుష్మాన్ హెల్త్ కార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ రజిత, సిబ్బంది కార్తిక్, బాలయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

### కుటీర పరిశ్రమలకు బ్యాంక్ రుణాలను ఇప్పించాలి

**- పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం నాయకులు**



చేనేత జౌళీశాఖ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో ఆర్వీఎం వస్త్రాలను తయారు చేస్తున్న కుటీర పరిశ్రమల యాజమానులకు బ్యాంక్‌ల నుంచి రుణాల ద్వారా కూలీ డబ్బులు ఇప్పించాలని సిరిసిల్ల కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం కన్వీనర్ గౌడ వాసు, కో-కన్వీనర్ కొండ ప్రతాప్ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళీశాఖ కార్యాలయంలో గురువారం కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంక్షేమసంఘం నాయకులు ఏడీ మిట్టకోల సాగర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్వీఎం వస్త్రాల తయారీకి యారన్ డిపో నుంచి నూలును 90 శాతం పైసా పెట్టుబడులు లేకుండా అందించడం హర్షనీయమన్నారు. కొద్ది రోజులుగా సిరిసిల్లలో నెలల తరబడి మరమగ్గాలు బంద్ ఉండడం కారణంగా కుటీర పరిశ్రమల యాజమానుల ఆర్థిక స్థితి చాలా దీనస్థితిలో ఉందన్నారు.

సిరిసిల్లలో చేనేత జౌళీశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చిన ఆర్వీఎం వస్త్రాల తయారీకి సంబంధించిన వేవింగ్ చార్జీలను తమ సంఘాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పూచికత్తు ఇస్తూ బ్యాంకు ద్వారా రుణాలను ఇప్పించాలని కోరారు. రుణాలు మంజూరుచేస్తే తమ వద్ద పనిచేసే కార్మికులకు సరైన సమయంలో జీతాలను ఇచ్చే వెసులుబాటు కలుగుతుం దన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి బ్యాంక్‌లనుంచి రుణాలను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కుటీర పవర్ లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంక్షేమసంఘం నాయకులు శంకర్, రవి, సుంచు ప్రకాష్, మధు, రాజు, భాస్కర్, రామస్వామి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికలను సజావుగా జరుపుకోవాలి



గంభీరావుపేటలో రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీవో

గంభీరావుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా జరుపుకోవాలని ఎంపీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో రాజేశ్వర్ పలు రాజకీయ పార్టీల నేతలతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం వార్డుల వారీగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుపుకోవాలని ఎంపీవో సూచించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్యాల రాజవీర్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎగదండి స్వామి, రాజిరెడ్డి ఉన్నారు.

**రుద్రంగి:** రుద్రంగి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికలపై వివిధ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నటరాజ్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన లిస్టులను వివిధ పార్టీ అధ్యక్షులకు అందజేశామన్నారు. గ్రామ పంచాయతీల్లో నోటీసు బోర్డుపై వార్డులకు సంబంధించి నూతన ఓటర్ల లిస్టు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రం గంగనర్సయ్య, మంచె రాజేశం, నంద్యాడపు వేంకటేష్, దేగవాత్ తిరుపతి, దయ్యాల కమలాకర్, చేప్యాల గణేష్, గుగ్గిళ్ల వేంకటేశం, దువ్వాక గంగాధర్ పాల్గొన్నారు.

**వీర్నపల్లి:** వీర్నపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ డ్రాఫ్టెడ్ పోలింగ్‌స్టేషన్‌పై వివిధ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ల వసతులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.

**ఇల్లంతకుంట:** స్థానిక సంస్థల ఎన్నికల ముసాయిదా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై మండలపరిషత్ కార్యాలయంలో రాజకీయపార్టీల నాయకులతో సమావేశం జరిగింది. పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటులో ఏవైన అభ్యంరాలు ఉంటే తెలుపాలని ఎంపీడీవో శశికళ సూచించారు. సమావేశంలో నాయకులు దేశెట్టి శ్రీనివాస్, గన్నారం నర్సయ్య, మంద అనీల్‌కుమార్, ఎల్లోజి, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

### బడీడు పిల్లలను పాఠశాలకు పంపించాలి

**- ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ - ఇటుకబట్టీల్లో పాఠశాల ప్రారంభం**




చంద్రంపేటలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన పాఠశాలలో ట్రాఫిక్ ఎస్ఐ

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బడికి వెళ్లే పిల్లలందరికి బడికి పంపించి చదువు నేర్పించాలని సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట శివారులోని ఇటుకబట్టీల వద్ద ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అక్షర దీపిక కార్యక్రమంలో భాగంగా ఇటుకబట్టీల్లో పనిచేసే కూలీల పిల్లలకు, సంచారా జాతుల పిల్లల కోసం పని ప్రదేశాల్లో పాఠశాలను ఏర్పాటు చేయగా సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బడీడు పిల్లలందరు పాఠశాలకు వెళ్లాలని తద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు యెల్దండి సాయికృష్ణ, అన్నారపు వేణుగోపాల్, బూర సతీష్, నాంపల్లి విష్ణు, నీలి సంతోష్, అరుణ్, అభి పాల్గొన్నారు.

## రుచికరమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలి

**- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రుచికరమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసే కామన్ డైట్ మెనూ అమలు కార్యక్రమాలను ఈ నెల 14న ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ మెనూ కార్యక్రమాలను ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు కామన్ డైట్ ప్లాన్‌ను డిసెంబరు 14 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. కామన్ డైట్ ప్లాన్‌పై విస్తృతంగా ప్రచారం కల్పించడంతోపాటు పిల్లల తల్లిదండ్రులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలని సూచించారు. హాస్టల్స్‌లలో కామన్ డైట్ వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి హాస్టల్‌లో ఒకే రకమైన ఆహారం విద్యార్థులకు అందిస్తామన్నారు. వంట గదులు, భోజనశాలలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 14న ఉదయం 11 గంటలకు వీఐపీలు రెసిడెన్షియల్ పాఠశాలలకు చేరుకుంటారని 11 నుంచి 12 గంటలవరకు పాఠశాలలను క్షుణంగా పరిశీలిస్తారని 12 నుంచి 12.30 గంటల నుంచి విద్యార్థులతో ఇంటరాక్షన్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం కామన్ డైట్ ప్లాన్‌కు సంబంధించిన హ్యాండ్ బుక్ ముఖ్య అతిథిలచే ఆవిష్కరించి ప్రసంగిస్తారని అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ముఖ్యఅతిథులు, పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కామన్ డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉన్నందున ఆ రోజు నాన్ వెజ్ ఆదివారం మెనూ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. గతంలో డైట్ చార్జీలు ఎనిమిది సంవత్సరాల తర్వాత 40శాతం ప్రస్తుత ప్రభుత్వం పెంచిందని, కాస్మోటిక్ చార్జీలను 16 సంవత్సరాల తర్వాత 200 శాతం పెంచిందన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థుల ఎదుగుదల ఆరోగ్యంపై ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తుందనే సందేశాన్ని ముఖ్యఅతిథులు మాట్లాడేలా చూడాలన్నారు. పాఠశాలలకు సరుకుల ఏ విధంగా వస్తున్నాయి, కిచెన్‌లో ఏవిధంగా భద్రపర్చాలి, విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, రెసిడెన్షియల్ పాఠశాలల ఆర్సీవోలు, ప్రిన్సిపాల్స్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పెరుగుతున్న చలితీవ్రత

**- జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 10.4 డిగ్రీలు**

సిరిసిల్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. గురువారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 10.4 డిగ్రీలు నమోదు కాగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 28.8 డిగ్రీలు నమోదైంది. గంభీరావుపేట, రుద్రంగి మండలాల్లో 10.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వీర్నపల్లిలో 11.4, బోయినపల్లిలో 11.9, గంభీరావుపేటలో 12.0, చందుర్తి 12.3, తంగళ్లపల్లి, ముస్తాబాద్ 12.5, వేములవాడ, కోనరావుపేట, వేములవాడ రూరల్ 13.0, సిరిసిల్ల, ఇల్లంతకుంటలో 13.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మళ్లీ చలితీవ్రత మొదలు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### సీసీ కెమెరాలు ప్రారంభం

ఇల్లంతకుంట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలను మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయనర్సింహ్మారెడ్డి గురువారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ 20 వేలరూపాయల సొంత ఖర్చులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దూస గోవర్ధన్, కటకం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ అందజేత

ఇల్లంతకుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాణి, గోపా జిల్లా జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌గౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలగౌడ్, కోశాధికారి మహేష్‌గౌడ్, సంఘ నాయకులు మత్తయ్య, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నకిలీ గల్ఫ్ ఏజెంట్లతో అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్పీ అఖిల్ మహాజన్**

రుద్రంగి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నకిలీ గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని, మన జీవనశైలిలో చదువు, ఉద్యోగంతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని దేగావత్ తండా గ్రామంలోని యువతకు స్పోర్ట్స్ కిట్స్‌ను ఎస్పీ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజల కోసమే పోలీసులు ఉన్నారని, ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయం అన్నారు. యువత చెడు మార్గాల వైపు మరలకుండా వారితో మమేకమై కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా జాబ్ మేళా, దోస్తీ మీట్ మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి నిర్మూలనలో ప్రతీఒక్కరు భాగస్వామ్యం కావాలని, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంటుందన్నారు. యువకులు గంజాయి, జూదం వంటి చెడు అలవాట్లకు, ఇతర చెడు మార్గాల వైపు మరలకుండా చదువుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, స్పోర్ట్స్ కోటాతో కూడా ఉద్యోగాలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యం పెరుగుతుందని, క్రీడల పోటీల నిర్వహణకు పోలీస్ శాఖ తరుపున యువతకు ఎల్లవేళలా సహకరించి, ప్రోత్సహిస్తామని అన్నారు. గ్రామాల నుంచి ఉపాది నిమిత్తం గల్ఫ్ వెళ్లేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇమిగ్రేషన్ చట్టబద్ధత ఉన్నవారి నుంచి వీసాలు పొందాలన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకునేందుకు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ 8712656411 లేదా దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్ వారిని సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్, తండా ప్రజలు, యువకులు పాల్గొన్నారు.



యువకులను వాలీబాల్ కిట్లను అందిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మన్నపల్లి గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొద్దుటూరి సంజీవరెడ్డి, సరోజన, శ్రీలత కారులో పట్టణంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి కరీంనగర్ వైపు వెళ్తున్న క్రమంలో తుమ్మన్నపల్లి వద్ద కారుకు ఎదురుగా ఓ వాహనం వచ్చి ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో శ్రీలతకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

కొడిమ్యాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి అనే వ్యక్తిని గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. చెప్యాల నుంచి నల్లగొండ వైపు వాకింగ్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. లచ్చిరెడ్డిని 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పాపయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీకి చెందిన కడమంచి పాపయ్య (54)అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపయ్య ఇటీవల తన సైకిల్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతానికి వచ్చి ఇంటికి తిరిగి వెళుతున్నాడు. వెనుక వైపు నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన అతన్ని మొదట సిరిసిల్లకు తరలించారు. మెరుగైన చికిత్స పొందిన పాపయ్య స్వల్పంగా కోలుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కూలీ పనులతో పాటు పాములను పట్టి బతుకు వెళ్లదీసేవాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పాపయ్యకు భార్య, కొడుకు ఉన్నారు.

### పురుగుల మందు తాగిన ఒకరి మృతి

మానకొండూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన బనుక రవి (46) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవితో పాటు అతడి ఇద్దరు అన్నలు ఓదెలు, పర్వతాలు మధ్య కొంత కాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ నెల 9న వివాదం ముదరడంతో వారి వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. రవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

### హాల్‌టికెట్ తీసుకొని వస్తుండగా రోడ్డు ప్రమాదం

- చికిత్స పొందుతూ వివాహిత మృతి
- మృతురాలికి 10 నెలల కూతురు


పూజిత(ఫైల్)

ఇల్లంతకుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్షలు రాయడానికి కరీంనగర్‌లో హాల్‌టికెట్ తీసుకొని ద్విచక్రవాహనంపై వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆకారపు పూజిత (23) అనే వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన పూజితకు సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆకారపు అజయ్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 10 నెలల కూతురు శ్రేష్ఠ ఉంది. పూజిత కరీంనగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వారం రోజుల క్రితం నారెడ్డిపల్లె గ్రామానికి వచ్చిన పూజిత డిగ్రీ హాల్‌టికెట్ తీసుకోవడానికి బుధవారం కరీంనగర్‌కు ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు వెళ్లారు. ఇంటికి వస్తుండగా పొత్తూరు గ్రామసమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పూజితకు తీవ్ర గాయాలయ్యాయి. భర్త అజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పూజిత మృతిచెందింది. భర్త అజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. పూజిత అంత్యక్రియలు లింగారెడ్డిపల్లె గ్రామంలో నిర్వహిం చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సముద్రాల కనకయ్య(67) రిటైర్డు సింగరేణి ఉద్యోగి. ఇంటి పనుల నిమిత్తం షాపుకు వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో హుజూరాబాద్ వైపు వెళ్తున్న సిలిండర్ల లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో తలకు, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే గ్రామస్థులు మాజీ సర్పంచ్‌కు విషయం తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకొని సొంత కారులో హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కనకయ్య కుమారుడు సముద్రాల కిషోర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### కారు ఢీకొని యువకుడు..

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్‌కు చెందిన పల్లె నిశాంత్ కుమార్ బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాడంలో దుర్మరణం చెందినట్లు టౌన్ ఎస్సై మన్మదరావు తెలిపారు. పట్టణంలోని బీట్ బజార్‌కు చెందిన మృతుడు బుధవారం రాత్రి స్నేహితుని వివాహ వేడుకల్లో పాల్గొని స్కూటీపై ఇంటికి వస్తుండగా బీట్ బజార్ వద్ద స్విఫ్ట్‌డిజైర్ కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### వర్క్‌ఫ్రం హోం పేరుతో మోసం

- జగిత్యాల యువకుడికి రెండు లక్షలు టోకరా

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం అని ఆశ పడి వాట్సాప్ లింక్ ఓపెన్ చేసిన జగిత్యాల యువకుడు 2 లక్షల 9 వేల రూపాయు పోగొట్టుకుని గురువారం పోలీసులను ఆశ్రయించాడు. జగిత్యాల పట్టణంలోని ఉస్మాన్ పురకు చెందిన ఇర్ఫాన్‌ఖాన్ అనే యువకుడికి అక్టోబర్ 21వ తేదీన వాట్సాప్‌లో వర్క్ ఫ్రం పేరుతో వాట్సాప్‌లో లింక్‌వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా వారు డబ్బులు చెల్లించమని చెప్పడంతో పలు దఫాలుగా 2 లక్షల 9 వేల రూపాయలను చెల్లించగా ఉద్యోగం ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మన్మదరావు తెలిపారు.

### కోతుల దాడిలో వృద్ధులకు గాయాలు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేటలో గురువారం కోతులు దాడిచేసి వృద్ధులను గాయపరిచాయి. గ్రామానికి చెందిన రామిడి మాధవరెడ్డి, కలువల సరోజన ఇళ్ల ముందు కూర్చొని ఉండగా కోతులు కాళ్లను, చేతులను తీవ్రంగా గాయపరిచాయి. మెరుగైన వైద్యంకోసం వారిని కాల్వశ్రీరాం పూర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. కోతులు మందలుగా గ్రామంలో వీధులవెంట విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, కోతులను చూసి పిల్లలు భయపడి ఇంట్లోకి పరుగులు తీస్తున్నారని, వృద్ధులు అక్కడే కూర్చొని ఉండగా మీదపడి గాయపరుస్తున్నాయని, ప్రభుత్వం కోతుల నివారణకు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# మెడికల్ హబ్‌గా రామగుండం



సింగరేణి మెడికల్ కళాశాల

- మెడికల్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు
- డెంటల్ కళాశాల అనుమతి కోసం ప్రతిపాదనలు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం మెడికల్ హబ్‌గా మారుతోంది. ఇప్పటికే మెడికల్ కళాశాల ప్రారంభం కాగా, దానికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాల ఈ ఏడాదిలో మంజూరైంది. ఈనెల 2న 60సీట్లతో నర్సింగ్ కళాశాలను ప్రారంభం కాగా, 30సీట్లతో పారా మెడికల్ కళాశాల ప్రారంభమైంది. అలాగే రామగుండంలో డెంటల్ కాలేజీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రతిపాదన పంపగా, త్వరలోనే ఆమోదం లభించే అవకాశాలున్నాయి. ఇందుకోసం స్థల సేకరణ కూడా ప్రారంభమైంది.

**మెడికల్ కళాశాలలో 450 మంది విద్యార్థులు..**

సింగరేణి మెడికల్ కళాశాలను 150సీట్లతో 2022లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. కాలేజీలో 450మంది విద్యార్థులు ఉండగా, 7శాతం సింగరేణి కార్మికుల ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు. ఇటీవల రూ.26కోట్లతో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందులో 58మంది విద్యార్థులు చేరారు. అదే విధంగా 30పారామెడికల్ సీట్లను కూడా భర్తీ చేశారు.

**'సిమ్స్'కు అనుబంధంగా డెంటల్ కళాశాల..**

సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)కు అనుబంధంగా డెంటల్ కళాశాల ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రతిపాదనలు పంపారు. ఆయన సానుకూలంగా స్పందించి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నివేదికను ఎన్ఎంయూకు పంపారు. 100సీట్లతో రామగుండంలో బీడీఎస్ కళాశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ రాశారు. త్వరలోనే డెంటల్ కళాశాల వచ్చే అవకాశం ఉంది. అలాగే సిమ్స్‌కు అనుబంధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 140 కోట్లతో ఐదు అంతస్థుల 720 పడకల సామర్థ్యం గల భవన నిర్మాణం చేపట్టారు. 2025 ఆగస్టుకల్లా


నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్థుల భవనం

పనులు పూర్తి కావాలని మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అధికారు లను ఆదేశించారు. రూ.16 కోట్లతో ఐసీ భవనం, టీబీ సెంటర్‌ను కూడా ఏర్పా టు చేయాలని, ఈ పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఐదు అంతస్థుల భవనం పూర్తయితే మెడికల్ కళాశాల విద్యార్థులకు, రామగుండం ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందనున్నది.

**పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి..**



**ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్**

రామగుండానికి పూర్వ వైభవం తీసుకురావడానికి మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను తీసుకు వచ్చాం. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మూడు 800 మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్లు, రూ.520 కోట్లతో మెడికల్ కళాశాల, రూ.140కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రూ.150కోట్లతో ఇంటి గ్రేడెట్ స్కూళ్లు, రూ.26కోట్లతో నర్సింగ్ కళాశాల, త్వరలో డెంటల్ కళాశాల ఏర్పాటు చేసి మెడికల్ హబ్‌గా తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం.


నిర్మాణంలో ఉన్న ఐసీయూ కేంద్రం

### గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఖాన్‌పుర ప్రాంతంలో బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడులో 403 గ్రాముల గంజాయి పట్టుబడింది. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యం లో తనిఖీలు నిర్వహించగా ఖాన్‌పుర ప్రాంతానికి చెందిన ఎండీ రహీం, సయీద్ సోయబ్ అక్తర్‌ల వద్ద గంజాయి పటు ్టబడిందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయితో పాటు 2 మొబైల్‌ఫోన్‌లను సీజ్ చేశామని సీఐ తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ పులి నగేష్‌గౌడ్, కానిస్టేబుళ్లు కుమార్ యా దవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

### గుడుంబా స్వాధీనం

**చొప్పదండి:** మండలంలోని రేవెల్లి గ్రామంలో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసులు గుడుంబాను పట్టుకున్నారు. ఎస్సై విజయభాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది కుంటాల అంజయ్య వద్ద రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. గుడుంబా తయారు చేసినా తరలించినా చర్యలుతీసుకుంటాయని సీఐ హెచ్చరించారు.

### యువకుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో ముల్కల నరేశ్(32) అనే యువకుడు బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావపల్లి గ్రామానికి చెందిన నరేశ్ సెంట్రింగ్ కూలీగా పనిచేసేందుకు సిరిసిల్ల పట్టణానికి రెండేళ్ల క్రితం వలసవచ్చాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడికి దూరంగా భార్య ఉంటుంది. దీంతో నాలుగు నెలల క్రితం మరో మహిళను పెళ్లిచేసుకున్నాడు. ఏడాది క్రితం తల్లి అనారోగ్యం పాలుకావడంతో చికిత్స కోసం అప్పులు అయ్యాయి. ఈ అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడని తల్లి లచ్చవ్వ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ఆటంకం

- తుర్తి గ్రామంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సమస్య - ఉన్నతాధికారులకు సమస్య వివరించిన సిబ్బంది


సర్వే నిలిచిపోయిన తుర్తి గ్రామం

కథలాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవుల్లో విసిరేసినట్టు ఉన్న మండలంలోని తుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగడం లేదు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో మూడు రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్‌లో యాప్ ద్వారా ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. తుర్తిలో అందుకు భిన్నంగా నేటికీ సర్వే ప్రారంభం కాలేదు. ప్రజాపాలనలో ఇక్కడ 236 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను గుర్తించడానికి ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. భీమారం, కొడిమ్యాల, రుద్రంగి, చందుర్తి మండలాల సరిహ ద్దుల్లో అటవీ ప్రాంతంలో ఉన్న తుర్తిలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన టవర్ మాత్రమే ఉంది. ఈ టవర్ రెండు సంవత్సరాలుగా పనిచేయడం లేదు. దీంతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో అంబారిపేట నుంచి టీవీల కేబుల్ ద్వారా కొందరు వినియో గదారులు బూస్టర్ ఏర్పాటు చేసుకుని సేవలు పొందుతున్నారు. ఈ సేవలు కొందరికి మాత్రమే పరిమితం కాగా సక్రమంగా పనిచేయడం లేదు. పంచాయతీ కార్యదర్శి తన యాప్‌లో సర్వే వివరాలు నమోదు చేసుకోడానికి ముందు లాగిన్ కావాల్సి ఉంటుంది. అప్పుడు మొబైల్‌కు వచ్చే ఓటీపీ ఎంట్రీ చేస్తేనే సర్వే మొదలు పెట్టడానికి అవకాశం ఉంటుంది. అక్కడ ఏ ఇతర నెట్‌వర్క్‌లు లేకపోవ డంతో సర్వేకు పూర్తిగా ఆటంకం ఏర్పడింది. ఈ నెల 20వ తేదీలోపు సర్వే పూర్తి చే యాలని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో నెట్‌వర్క్ లేకపోవడంతో సమ స్యగా మారింది. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి గురువారం ఎంపీడీవోకు వివరించారు. 'ఆంధ్రజ్యోతి' ఎంపీడీవో శంకర్‌ను దీనిపై వివరణగా కోరగా నెట్‌వర్క్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

### యువకుడి వేధింపులు.. యువతి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ గ్రామంలో యువకుడి వేధింపులు భరించలేక ఓ యువతి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టింది. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో మండలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సిరిసిల్ల న్యాయమూర్తికి సమాచారం అందించడంతో ఆసుపత్రికి చేరుకుని బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి అదే గ్రామంలోని ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. సదరు యువకుడు తరుచూ ఆమెను సెల్‌ఫోనులో వేధించేవాడు. తట్టుకోలేని యువతి గురువారం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఓ ఆసుపత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు యత్నించడంతో యువకుడు పారిపోయాడు. స్థానిక పోలీసులు ఘటనపై వివరాలను సేకరిస్తున్నారని తెలిసింది.

### బంగారు ఆభరణాలు బాధితురాలికి అప్పగింత


ఆభరణాలను అప్పగిస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ హ్యాండ్‌బ్యాగ్‌లో 10 తులాల బంగారు ఆభరణాలు మరిచిపోయిన బాధితురాలికి పోలీసులు గురువారం ఆభరణాలను అప్పగించారు. కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన మామిడిపల్లి హేమశ్రీ(25) తన భర్త గణేష్‌తో కలిసి బుధవారం కరీంనగర్‌లో ఒక పెళ్లి వేడుకకు హాజరైంది. తిరిగి జగిత్యాలకు వెళ్లేందుకు ఫంక్షన్‌హాల్ నుంచి బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణించింది. ఆటో దిగి బస్టాండ్‌లోకి వెళ్ళిన ఆ మహిళ కొద్దిసేపటికి తన బ్యాగును ఆటోలోనే మరిచిపోయినట్లు గ్రహించి వెంటనే ఒకటో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, ఇతర సాంకేతికత ఆధారంగా ఆటోను గుర్తించిన పోలీసులు సంబంధిత ఆటో డ్రైవర్ నుంచి బ్యాగును, అందులోని 10 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బంగారు ఆభరణాలను గురువారం కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. ఆభరణాలు గుర్తించిన సీఐ బిల్ల కొటేశ్వర్, సిబ్బంది, క్రైమ్‌పార్టీ కానిస్టేబుళ్ళు కుమార్‌లకు పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి రివార్డులు అందజేశారు.

# పోలీసుల విస్తృత తనిఖీలు

- ధ్రువపత్రాలు లేని 54 వాహనాలు సీజ్
- డ్రంకెన్‌డ్రైవ్‌లో 18 మందిపై కేసు


తనిఖీ చేస్తున్న ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫొరెబి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో బుధవారం అర్ధరాత్రి ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫొరెబి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 54 వాహనాలను సీజ్ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మందిపై కేసులు నమోదు చేశారు. కరీంనగర్ టౌన్ పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రొబెషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫొరెబి ఆధ్వర్యంలో టౌన్ ఏసీపీ నరేందర్, మాధవి తనిఖీలను నిర్వహించారు. రాత్రి నగరంలో బ్రీత్ ఎనలైజర్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్‌లతో మద్యం సేవించిన వారిని, అనుమానితులను తనిఖీ చేసి పలువురిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం వదిలిపెట్టారు. నార్కొటిక్ డ్రగ్స్ గుర్తించేందుకు శిక్షణ తీసుకున్న జాగిలం లియోతో పలు వాహనాలను, ఆర్టీసీ బస్టాండ్ కార్గో సర్వీస్ సెంటర్‌లోని పార్శిళ్లను, అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో సీఐలు కోటేశ్వర్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోరంటాలలో బ్రిడ్జి శిలాఫలకం ధ్వంసం


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం గోరంటాల వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులకు సంబంధించి, శంకుస్థాపన సమయంలో ఇటీవల ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రూ: 65 లక్షలతో గత నవంబరు 30న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. అందులో భాగంగా వేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం ఉదయం ధ్వంసం చేశారు. దీనిపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, వెంకటి, ప్రవీణ్, పర్శ రాములు తదితరులు ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఫిర్యాదు చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

**చర్యలు తీసుకోవాలి**

**సిరిసిల్ల టౌన్:** అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల నాయకులు అన్నారు. గంభీరావుపేట మండలం రైతుల సౌకర్యార్థం గోరంటాల నుంచి రత్నగిరిపల్లెను కలుపుతూ క్యాజ్‌వే నిర్మాణానికి ప్రభుత్వం రూ. 65లక్షలు మంజూరు చేసిందన్నారు. గత నెల క్యాజ్‌వే పనుల ప్రారంభోత్సవం కోసం శిలాఫలకాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరిం చారన్నారు. గురువారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆరోపి ంచారు. మూడు రోజుల క్రితం గజసింగవరం రాజేశ్వర్‌రావ


గోరంటాల వద్ద ధ్వంసమైన శిలాఫలకం

నగర్ మేయిన్ రోడ్డుకు పక్కన గుర్తు తెలియన వ్యక్తులు బీఆర్ఎస్ గద్దెను కూల్చేస్తే అది కాంగ్రెస్ పార్టీ నాయకులు కూర్చారని బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన గద్దెను, శిలాఫలకం కూల్చిన వారిపై ఎస్పీ విచరణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, ఎల్లారెడ్డిపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమరిశెట్టి తిరుపతి, సీనియర్ నాయకులు పర్శహన్మాండ్లు, పిట్ల వెంకటి, అంజిరెడ్డి, పరశురాములు, ప్రసాద్‌రావు, ప్రవీణ్ , రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. ఉదయం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 13,659 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 12,970 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదో సెమిస్టర్‌లో మొత్తం 11,032 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,599 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు.

## ఇంటి పైకప్పు కూలి షార్ట్‌సర్క్యూట్ ఒకరి సజీవదహనం


తిరుపతి(ఫైల్)

మల్యాల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటల్లో అక్కడికక్కడే సజీవ దహనం అయ్యాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన గాతం తిరుపతి (37) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గురువారం రాత్రి రోజు వారి మాదిరిగానే తిరుపతి తమ పాత ఇంట్లో ఒక్కడే పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి పైకప్పు కూలింది. దీంతో ఇంట్లోని విద్యుత్ తీగలు తెగి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో బయటకు రాలేక తిరుపతి మంటల్లోనే సజీవదహనం అయ్యాడు. చుట్టు పక్కల వాళ్లు గమనించి పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో సీఐ నీలం రవి చేరుకొని సంఘటన స్థలం పరిశీలించగా ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేసింది. అప్పటికే తిరుపతి మృతిచెందడంతో మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

# పట్టుదలే ఆయుధంగా..

### అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో పతకాలు

### ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన ఎస్సారార్ విద్యార్థులు


అథ్లెటిక్స్ ట్రాక్స్‌పై మనోజ్, సందీప్

**పట్టుదలే ఆయుధంగా అథ్లెటిక్స్‌లో రాణించి ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు ఇద్దరు ఎస్సారార్ కళాశాల విద్యార్థులు. అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ చాటి బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. ఆర్మీలో ఫిజికల్ టెస్ట్, రన్నింగ్‌లో ప్రతిభ చూపి రాష్ట్రంలోనే మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఆర్మీలో శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లోని లడక్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.**

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల విద్యార్థులు చింతల సందీప్, ఏ సాయిమనోజ్‌లు చిన్నప్పటి నుంచి ప్రతిభ గల విద్యార్థులుగా పేరు తెచ్చుకున్నారు. సందీప్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామరకుంట మారుమూల గ్రామానికి చెందినవాడు కాగా సాయిమనోజ్‌ది కరీంనగర్. ఎస్సారార్‌లో డిగ్రీ చదువుతుండగా వీరి చూపు అథ్లెటిక్స్ వైపు మళ్లింది. వీరి ఆసక్తిని గమనించిన కోచ్ వరుణ్ కృష్ణన్ అథ్లెటిక్స్‌లో ఓనమాలు నేర్పించారు. ఫలితంగా అనతి కాలంలోనే వీరు జిల్లా, రాష్ట్ర అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటారు.

ఆర్మీలో ఉద్యోగం సంపాదించడమే లక్ష్యమని వారు తమ మనసులోని మాటను కోచ్ వరుణ్‌కృష్ణన్‌కు చెప్పారు. దీంతో వరుణ్‌కృష్ణన్ ఇద్దరు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. దీంతో వీరు 2022, 2023 సంవత్సరాల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి, అంతర యూనివర్సిటీ అథ్లెటిక్స్‌లో విశేష ప్రతిభ చాటి బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. అనంతరం 2023 మార్చిలో జరిగిన ఆన్‌లైన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో సందీప్, ఏ సాయిమనోజ్‌లు ఉత్తీర్ణులయ్యారు. అనంతరం ఆగస్టులో ఖమ్మంలో జరిగిన ఫిజికల్ టెస్ట్, రన్నింగ్‌లో ప్రతిభ చూపి రాష్ట్రంలోనే మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. తదనంతరం జరిగిన వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆర్మీలో ఉద్యోగాలు సాధించి తమ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు సందీప్, మనోజ్‌లు. నాసిక్‌లో చింతల సందీప్ శిక్షణ పొందగా, మనోజ్ బెంగుళూరులో శిక్షణ పూర్తి చేసుకున్నాడు. అనంతరం 2024 జూన్ 20న జమ్మూకాశ్మీర్‌లోని లడక్‌లో విధుల్లో చేరారు.

### సాయిమనోజ్ ప్రతిభ



మనోజ్ తండ్రి మోహన్, తల్లి జ్యోతి. ఇద్దరూ కూలి పనులు చేస్తూ తమ కొడుకును డిగ్రీ వరకు చదివించారు. మనోజ్ రాష్ట్ర స్థాయిలో జరిగిన అంతర్ జిల్లా అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. 2022 జనవరి 4 నుంచి 7 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో జరిగిన అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. హైదరాబాద్ గచ్చిబౌలిలో 2022 మే 14, 15 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-20 పురుషుల అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాలు సాధించాడు. 2022 అక్టోబరు 22, 23 తేదీల్లో వరంగల్‌లో జరిగిన 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. వివిధ వయస్సు గ్రూపుల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో నాలుగు బంగారు, మూడు రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించాడు.

### సందీప్‌కు రెండు స్వర్ణాలు



సందీప్ తండ్రి రాజయ్య వ్యవసాయ కూలీ. 2023లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొని 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో బంగారు పతకాన్ని, 1500 మీటర్ల పరుగులో రజత పతకాన్ని సాధించాడు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో 2023లో జరిగిన సౌత్‌జోన్ జాతీయ అథ్లెటిక్స్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. 2023 బెంగుళూరులో జరిగిన అఖిల భారత అథ్లెటిక్స్‌లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించాడు. అథ్లెటిక్స్‌లో రెండు బంగారు, రెండు రజత, రెండు కాంస్య పతకాలను సాధించాడు.

## రాజన్నను దర్శించుకున్న సినీనటి


గార్లపాటి కల్పలతకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని పుష్ప సినిమా హీరో అల్లు అర్జున్ తల్లి క్యారెక్టర్ చేసిన గార్లపాటి కల్పలత దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి గురువారం విచ్చేసిన ఆమె ముందుగా పార్వతీపరమేశ్వరుల ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

**మల్యాల:** ఇటీవల విడుదలైన పుష్ప-2లో పుష్పకు తల్లిగా నటించిన గార్లపాటి కల్పలత గురువారం కొండగట్టు అంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

ధర్మపురి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి ): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ యమ ధర్మరాజు ఆలయంలో గురు వారం స్వామివారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.

## బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు వెల్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల నిర్మల్ జిల్లాలో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు విశేష ప్రతిభచాటింది. అందులోని పాఠశాల క్రీడాకారులు కె సాయిచరణ్, హాసిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎండి యూనిస్‌పాష తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ శ్రీనివాస్, డీఈవో సీహెచ్‌వి జనార్ధన్‌రావు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి వేణుగోపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## గేదెల ఎంపికలో అధికారుల ఒత్తిడి

### - ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఆవేదన


హరియాణాలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లబ్ధిదారులు

చందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద 2020-21 సంవత్సరంలో ఎంపికైన లబ్ధిదారులు తమకు రెండు నెలల సూడి ఉన్న గేదెలను తీసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చందుర్తి మండల విలేకరులతో వారు గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద చందుర్తి మండలం నుంచి 10 మంది రెండు గేదెల స్కీములో అర్హత సాధించారు. తమకు అధికారులు గేదెలను ఇప్పిస్తామని ఈనెల 8న హర్యానా రాష్ట్రంలోని రోహతకు జిల్లాలోని ఖురానా డైరీ ఫామ్‌కు ఎనిమిది నెలల సూడి గేదెలను ఇప్పిస్తామని తీసుకువచ్చారన్నారు. డైరీ ఫామ్‌కు వెళ్లిన తర్వాత రెండు నెలల సూడి గేదెలను తీసుకోవాలని తమను అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. రెండు నెలల సూడి గేదెను తీసుకుంటే దాదాపు ఏడు నెలల వరకు గేదెలను పోషించవలసి వస్తుందని, ఆర్థికంగా నష్టపోతామని పేర్కొన్నారు. ఎనిమిది నెలల సూడి గేదెని ఇప్పించడంతో నెలలోనే గేదె దూడకు జన్మనివ్వడంతో పాలు ఇస్తుందన్నారు. డైరీ ఫామ్ వారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులు 8 నెలల సూడిగేదను ఇవ్వడానికి సరిపోవని ఎక్కువ డబ్బులు ఇస్తే ఇస్తామని చెప్పారని లబ్ధిదారులు తెలిపారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తొమ్మిది నెలల సూడిగేదెలను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కాగా లబ్ధిదారులు గురువారం రాత్రి హర్యానా నుంచి జిల్లాకు బయలు దేరారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ఇళ్లు లేనివారికి అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోరుట్లలో 1500, జగిత్యాలలో 6 వేల గుడిసెలు కూల్చిన ప్రభుత్వం గుడిసె ఉన్న ప్రతి ఒక్కరికి 120 గజాల స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానంలో భాగంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించాలని, నిరుద్యోగ యువతీ, యువకులకు చెరుకు రైతులకు ఉపాధి కల్పించాలని అలాగే బీడీ కార్మికులకు 26 రోజుల పని కల్పించాలని, జీవనభృతి రూ.4,016 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గర్వందుల రమేష్, తిరుపతి నాయక్, బుర్ర శేఖర్, మల్యాల సురేష్, వెంకటాచారి, తిరుపతి, కోమటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అదానీ వ్యవహారంపై మోదీ సమాధానం చెప్పాలి

### - సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అదానీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదానీపై అమెరికా చేసిన ఆరోపణలకు ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని, ఈ విషయమై కనీసం పార్లమెంటులో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టినా, బీజేపీ ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబిస్తోందని, ఈ మొత్తం వ్యవహారంపై పార్లమెంట్లో చర్చ జరగాలన్నారు. అదానీకి, ప్రభుత్వానికి మధ్య ఉన్న ఒప్పందాలను ప్రధాని మోదీ బహిర్గతం చేయాలని సూచించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారని, ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు వచ్చేటట్లు కార్యాచరణ రూపొందించి నిరుపేదలను ఆదుకోవాలన్నారు. ఈనెల 26 నుంచి రాష్ట్రంలో జరిగే సీపీఐ వంద సంవత్సరాల ఉత్సవాలను జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో, ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతున్న దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, కర్షకులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమష్టిగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచి తమ హక్కులు సాధించుకోవాలని, దానికి సీపీఐ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందన్నారు. జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ అనేక ఉద్యమాలకు నిలయంగా సీపీఐ ముందుంటుందని, ప్రభుత్వాలు మారినా బడుగుబలహీన వర్గాలకు పార్టీ అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గోశిక మోహన్, కార్యవర్గ సభ్యుడు గౌతమ్ గోవర్ధన్, రామగుండం నగర కార్యదర్శి కే కనకరాజ్, కౌన్సిల్ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, ఓదెమ్మ, పెద్దపల్లి పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయకుమార్, మనస్ కుమార్, సూర్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం తదితరులు పాల్గొన్నారు

**కోరుట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ జిల్లా స్థాయి సమావేశం సీపీఐ నాయకురాలు ఎన్నం రాధ అధ్యక్షతన జరిగింది. అమరుల స్థూపంతో పాటు వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. 1925 డిసెంబర్ 26వ తేదీన సీపీఐ పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. పార్టీ ఆవిర్భావంతో ప్రజా సమస్యలపై పోరాటం చేసి ఎన్నో సమస్యలు పరిష్కార దిశగా నడిచిందని అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించే వరకు ప్రజలను చైతన్యం చేసిన పోరాట చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని, రైతు భరోసా చెల్లించాలని, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ పెంపు మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెన్న సురేష్, చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ఎండి ముక్రం, మనగూరి హన్మంత్, కొక్కుల శాంత, భూమేశ్వర్, ఎద్దండి భూమయ్య, ఎండి ఉస్మాన్, దేవదాస్, కిరణ్, రాంబాబు, వెన్న మహేష్, సమీర్, దశరథం, భూంరెడ్డి, అనంతరాజం, సాండారి మహేశ్, రాజన్నలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయాన్ని ఎండోమెంట్‌లో కలపవద్దు

### - మెట్‌పల్లిలో వెల్లుల్ల గ్రామస్థుల ధర్నా


మెట్‌పల్లిలో ధర్నా నిర్వహిస్తున్న వెల్లుల్ల గ్రామస్థులు

మెట్‌పల్లి టౌన్/మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంను ఎండో మెంట్‌లో కలుపవద్దని డిమాండ్ చేస్తూ గురువారం వెల్లుల గ్రామస్థులు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామం నుంచి మెట్‌పల్లికి ర్యాలీగా బయలుదేరి వచ్చారు. ఎండోమెంట్‌లో నుంచి వెంటనే ఎల్లమ్మ ఆలయంను తీసేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఆలయం నుంచి వస్తున్న ఆదాయంతో పాటు గ్రామస్థులందరం కలిసి ఆలయంను అన్ని విధాల అభివృద్ధి చేశామని అన్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అభివృద్ధి చెంది న ఆలయంను ఓ ముగ్గురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎండోమెంట్‌లో కలప డంపై మండిపడ్డారు. అధికారులు స్వాధీనం చేసుకోవడంతో గ్రామస్థులు ఉపాధి కోల్పోతారని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎండోమెంట్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఘటన స్థలంకు మెట్‌పల్లి సిఐ నిరంజన్‌రెడ్డి, డిఏఓ వసంతలు చేరుకోని గ్రామస్థులను సముదాయించారు. మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

## ముగిసిన గీతా జయంతి ఉత్సవాలు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో చేపడుతున్న గీతా జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. రాజన్న ఆలయంలో గురువారం ఉదయం అర్చకులు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పరివార దేవతాలకు అభిషేకము, అర్చనలు చేపట్టారు. అనంతరం చేపట్టిన గీతహోమం కార్యక్రమంలో సంస్కృత పాఠశాల విద్యార్థులు భగవద్గీత పఠనం చేశారు. కార్యక్రమానికి రాజన్న ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణా కార్యక్రమం


ఛాత్రోపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య

తిమ్మాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఛాత్రోపాధ్యాయులకు ఈ నెల 9నుంచి నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో డెల్ టెక్నాలజీస్ సహకారంతో ఛాత్రోపాధ్యాయులకు మహిళ సాధికారత, కృత్రిమ మేధస్సు అనే అంశంపై నాలుగు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా లర్నింగ్ లింక్స్ పార్మేషన్ అసిస్టెంట్ మేనేజర్ సంజీవులు ఛాత్రోపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారని చెప్పారు. ఛాత్రోపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను, తరగతి గది బోధనలో ఉపయోగిం చాలని చెప్పారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న 122 మంది ఛాత్రోపా ధ్యాయులకు సరిఫికెట్లను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## అంబేద్కర్ సంఘ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం


ఇరుకు గదిలో కూర్చున్న చిన్నారులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాలమైన గదులు, ఆటపాటలతో సాగాల్సిన అంగన్‌వాడీ కేంద్రం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ సంఘం భవనంలో కొనసాగుతోంది. ఒకే గదిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సొంత భవనం లేకపోవడంతో ఇరుకుగా ఉన్న సంఘం భవనంలోనే చిన్నారులు, వంట, ఆట వస్తువులు, ప్రభుత్వం సరఫరా చేసే సరుకులను నిల్వ చేయాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచరు పేర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 17 మంది చిన్నారులు ఉన్నారు. చిన్నారులు విద్యతోపాటు ఆటలు ఆడుకునేందుకు విశాలమైన గదులు లేకపోవడంతో ఇరుకు గదిల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. అంగన్‌వాడీ టీచరు అదే గదిలో ఓ సిలిండర్‌ను ఏర్పాటు చేసుకుని కోడిగుడ్లను ఉడకపెట్టడం, భోజనం తయారుచేస్తున్నారు. తన ఇంటి నుంచి వండిన కూరలను తీసుకొచ్చి వడ్డిస్తున్నారు. తాగు నీటి సౌకర్యం లేక దూర ప్రాంతం నుంచి నీటిని తీసుకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అంబేద్కర్ సంఘ భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

## న్యూస్ బాక్స్

### బియ్యం వితరణ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న నిరుపేద దాసరి దేవయ్య కుటుంబానికి స్థానిక అంబేద్కర్ చైతన్య యువజన సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గురువారం బియ్యం వితరణ చేశారు. ఆ కుటుంబ పరిస్థితిని చూసి చలించిన సభ్యులు, నాయకులు 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

### క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

వేములవాడ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మర్రిపల్లి గ్రామంలోని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ కల్వల, స్థానిక పాస్టర్ సన్నీపాటి కరుణాకర్, పూడూరు దేవయ్య, పిలిప్, బాస నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా ఉన్న గుంత

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మొదటి బైపాస్‌లో తాగునీటి ట్యాంకు సమీపాన ఉన్న డ్రెయినేజీపై ఉన్న బీళ్ల ధ్వంసమైంది. ఆదమరిచి అడుగు వేస్తే అందులో చిక్కుకోవాల్సిందే. సంబంధిత అధికారులు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ఆర్డీవోను సన్మానించిన యూనియన్ నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ సభ్యులు ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలతో సన్మానించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరు వేసేందుకు తమ దగ్గర ఉన్న మొబైల్స్ సరిగా పనిచేయడం లేదని కొత్త మొబైల్స్‌ను ఇవ్వాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేదూరి మధు, ఉపాధ్యక్షుడు లకావత్ మున్నానాయక్, కొమ్మెట దేవయ్య, కార్యదర్శి ఆవునూరి వెంకటేష్, కోశాధికారి ఎడపెల్లి మహేందర్, సభ్యులు పాల్గొన్నారు.

# ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు



ఎల్లారెడ్డిపేటలో బహుమతులను ప్రదానం చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ఎంపీడీవో సత్తయ్య, నూకలమర్రిలో క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగిన మున్సిపల్ స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలు గురువారం ముగిసాయి. చివరిరోజు పురుషులు, మహిళలకు వివిధ విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. మొదటి రోజు వాలీబాల్, కబడ్డీ, రెండో రోజు ఖోఖో, యోగ, మూడో రోజు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్లు, క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విజేతలకు బహుమతులను అతిథులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** సీఎం కప్‌లో భాగంగా మండల కేంద్రంలో ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో మొత్తం 45 జట్లు తలపడ్డాయి. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను ప్రదానం చేశామని ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ఎంపీడీవో సత్తయ్య, పంచాయతీకార్యదర్శులు, పీఈటీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

**ఇల్లంతకుంట:** మండలంలోని గాలిపెల్లి జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు మూడు రోజుల పాటు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పావని, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి సంపత్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు సానబాబు. రాధారాణి, సాబీర్, శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

**తంగళ్లపల్లి:** సీఎం కప్ క్రీడల పోటీల్లోని విజేతలకు ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్ర మంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, పాఠశాల హెచ్ఎం శంకర్ నారాయణ, స్పాన్సర్స్ జూపల్లి రాజేశ్వరరావు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

**వేములవాడ రూరల్:** ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. నూకలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అందజేసిన సర్టిఫికెట్ల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలో నిర్వహించిన సీఎం కప్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజుతో కలిసి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పర్శరాములు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వీర్నపల్లి:** క్రీడాకారుల్లో స్నేహభావం పెంపొందించేలా క్రీడలు ఉపయోగపడతాయని మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి ముగింపు పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అధికారులు, నాయకులు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, ఎస్సై ఎల్లాగౌడ్, ఎంఈవో శ్రీనివాస్, ప్రిన్సిపల్ అశోక్, పీఈటీ ప్రతాప్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీటీ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు నాయక్, ప్రకాష్ నాయక్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వీర్నపల్లిలో బహుమతులను అందిస్తున్న అధికారులు, నాయకులు

# ప్రమాదకరంగా ఇరుకు వంతెన

- ఇబ్బందుల్లో వాహనదారులు


రక్షణ గోడలు లేని వంతెన

చందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామ శివారులోని చర్చి సమీపంలో గల ఇరుకైన వంతెనతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పురాతనంలో కట్టిన వంతెనను పునర్నిర్మాణం చేపట్టకపోవడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

వంతెనపై ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఇప్పటికే పలుమార్లు ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు కల్వర్టులో పడి పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలో ఉన్న ఈ వంతెనపై నుంచి నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ఎలాంటి ప్రమాదాలు, ప్రాణనష్టం జరగకముందే అధికారులు అలసత్వం వీడి వంతెనను పునర్నిర్మాణ పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

- చిర్రం తిరుపతి, మాజీ ఉప సర్పంచ్, చందుర్తి



బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నూతనంగా బ్రిడ్జిని నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. బ్రిడ్జిని వెడల్పుగా నిర్మించి ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలి. బ్రిడ్జి సమీపంలో మూలమలుపు వద్ద ఉన్న చెట్లను తొలగించడంతో పాటు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రక్షణ గోడ ఏర్పాటు చేయాలి.

# సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- మూడో రోజుకు చేరిన రిలే నిరహారదీక్షలు
- దీక్ష శిబిరంలో వంటావార్పు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో సమగ్ర శిక్ష విభాగంలో కాంట్రాక్టు పద్ధతిన విధులను నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరినీ రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరహార దీక్షలు గురువారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో వంటావార్పు చేపట్టి అక్కడే వంటలను తయారు చేసుకొని దీక్ష శిబిరంలో భోజనాలు చేసి ఉద్యోగులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేవేందర్ మాట్లాడుతూ ప్రత్యేకంగా సమగ్ర శిక్ష 14 విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. పనిచేస్తున్న ఉద్యోగులందరికీ మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 10లక్షలు, ఆరోగ్య బీమా 10లక్షల సౌకర్యం కల్పించడంతో పాటు పదవీవిరమణ సమయంలో 25లక్షల బెనిఫిట్స్ కింద మంజూరు చేయాలన్నారు. విద్యాశాఖ, ఇతర శాఖల్లో ప్రభుత్వ కొలువుల నియామకాల్లో వేయిటేజ్ కల్పించాలన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సాధ్యమైనంత త్వరగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని కోరారు. దీక్ష శిబిరాన్ని టీటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. దీక్షల్లో బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ, వెంకటరమణ, పద్మ, నరేందర్, శ్రీనివాస్, దేవరాజ్, ఎండి సలీం, వెంకటేష్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట దీక్షలో కూర్చున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

### ప్లాస్టిక్ కవర్లు విక్రయం: జరిమానా


జరిమానా రసీద్‌తో దుకాణ యజమాని

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని మార్కెట్ ఏరియా, పెద్ద బజారులోని ప్లాస్టిక్ కవర్ల విక్రయదారుల దుకాణాలపై గురువారం మున్సిపల్ కమిషనర్ లావణ్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్స్ విక్రయిస్తున్న దుకాణాల యజమానులకు కమిషనర్ లావణ్య జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో 120 మైక్రాన్స్ కన్నా తక్కువ మందం గల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్స్ 60 గ్రాముల గల నాన్ ఓవెన్ కవర్స్, ప్లాస్టిక్ గ్లాసులను క్రయవిక్రయాలు జరిపినా, నిల్వ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది ఉమ్మర్, గుమ్మడి అంజయ్య ఉన్నారు.

### వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం శివారులోని ధర్మోర వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం వేంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు చక్రపాణి మాధవాచార్యులు స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కును కల్పించాలి

- మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో నిరుపేదలకు ప్రభుత్వాలు అందించిన ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కులను కల్పించేలా మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్ల కార్మిక భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్, సుందరయ్య నగర్, పద్మనగర్, ఇందిరానగర్, రాజీవ్‌నగర్, తారకరామానగర్, గణేష్‌నగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు కల్పించాలని కోరారు. 45 సంవత్సరాల క్రితం ప్రభుత్వం నిరుపేదలకు నివాస స్థలాల పట్టాలు ఇచ్చారన్నారు. కానీ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు లేకపోవడంతో బ్యాంకు నుంచి లోను కానీ వ్యాపారం కోసం లోను కాని స్థలం మీద తీసుకోవడానికి వీలు లేకుండా పోతోందన్నారు. ప్రజలందరూ ఎన్నో ఏళ్ల నుంచి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని పోరాడుతున్నారన్నారు. పట్టా భూముల మాదిరిగానే వీరికి కూడా అన్నిహక్కులు కల్పించాలన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నవించినా మున్సిపల్ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేసినా సమస్య పరిష్కారం జరగలేదన్నారు. పోరాటాలు ధర్నాలు చేసినవారు, అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఈ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ విషయంపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షను గుర్తించి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అందర్నీ ఐక్యం చేసి ప్రజాపోరాటం నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎగమంటి ఎల్లారెడ్డి, పట్టణ కార్యదర్శి అన్నల్దాస్ గణేష్, నాయకులు నక్క దేవదాస్, ఉడుత రవి, కోల శ్రీనివాస్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్

# కాలువ అలైన్‌మెంట్ మార్చాలని వినతి

కథలాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ ఎడమ కాలువలో తమ భూములు కోల్పోతున్న నేపథ్యంలో అలైన్‌మెంట్ మార్చాలని కోరుట్ల ఆర్డీఓ జికేందర్‌రెడ్డికి మండలంలోని పోతారం నిర్వాసిత రైతులు వినతిపత్రం అందజేశారు గురువారం ఎడమ కాలువ నిర్మాణం కోసం భూసే కరణ నిమిత్తం గ్రామసభ నిర్వహించారు. తమకు ఉన్న కొద్దిపాటి భూములు కోల్పోతున్నందున తమకు జీవనోపాధి కష్టంగా ఉంటుందని రైతులు ఆర్డీఓకు గోడు వెళ్లబోసుకున్నారు.

కాలువ నిర్మిస్తే మాత్రం గుట్టల పక్క నుంచి తవ్వాలని కోరారు. పోతారంలో కాలువలో 46 మంది రైతులకు సంబంధించిన 24 ఎక రాల 17 గుంటల భూమి నిర్మాణంలో కోల్పోతున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ నగేశ్, జూనియర్ అసిస్టెంట్ మురళి, మాజీ సర్పంచ్ ధర్మపురి జలందర్, రాష్ట్ర కాంగ్రెస్ చేనేత విభాగం కార్యదర్శి పులి హరిప్రసాద్, రైతులు ఉన్నారు.


గ్రామసభలో ఆర్డీవోకు విన్నవిస్తున్న రైతులు

# ఉత్తమ ఫలితాలకు యాక్షన్ ప్లాన్

(5వ పేజీ తరువాయి..)

ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో 902 మంది పరీక్షలకు హాజరు కాగా 498 మంది ఉత్తీర్ణులయ్యారు. 2019లో మొదటి సంవత్సరంలో 50 శాతం, 2020లో 51 శాతం, 2021లో 37 శాతం, 2022లో 60 శాతం, 2023లో 57 శాతం, ప్రస్తుతం 2024లో 57.79 సాధించారు. రెండోసంవత్సరం ఫలితాల్లో 2019లో 61 శాతం, 2020లో 63 శాతం, 2021లో వంద శాతం, 2022లో 64 శాతం, 2023లో 69 శాతం, 2023-2024లో 65.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఇంటర్ ఒకేషనల్‌లో 902 మంది పరీక్షలకు విద్యార్థులు హాజరు కాగా 498 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 404 మంది ఫెయిలయ్యారు. మొదటి సంవత్సరంలో 463 మంది విద్యార్థులకు గాను 221 మంది ఉత్తీర్ణులయ్యారు. 242 మంది ఫెయిలయ్యారు. 47.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురలో 272 మందికిగాను 87 మంది, బాలికల్లో 191 మందికి గాను 134 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 47.73 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరంలో 439 మంది విద్యార్థులకు గాను 277 మంది ఉత్తీర్ణులయ్యారు. 63.1 శాతం ఉత్తీర్ణత ఉంది. బాలురలో 235 మందికి గాను 117 మంది, బాలికల్లో 204 మందికి గాను 160 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే సంకల్పంతో అధికారులు ఉన్నారు.

● **బాలికలే భేష్...**

జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో ప్రతీ సంవత్సరం బాలికలే భేష్ అనిపించుకుంటున్నారు. గత విద్యా సంవత్సరం ఫలితాల్లో మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో 6,722 మంది విద్యార్థులకు గాను 4,130 మంది ఉత్తీర్ణులయ్యా రు. 2,592 మంది ఫెయిలయ్యారు. బాలురు 1,195 మంది, బాలికలు 2,935 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో అధికంగా బాలికలు 1,740 మంది ఉన్నారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 3,542 మంది విద్యార్థులకు గాను 2,047 మంది ఉత్తీర్ణులయ్యారు. 1,495 మంది ఫెయిలయ్యారు. 57.79 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురులో 1,331 మంది పరీక్షలకు హాజరు కాగా 599 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 2,211 మంది హాజ రు కాగా 1,448 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే 849 మంది బాలికలే అధికంగా ఉన్నారు. రెండో సంవత్సరంలో 3,180 మంది పరీక్షలకు హాజరు కాగా 2,083 మంది ఉత్తీర్ణులు కాగా 65.5 శాతంగా ఉంది. బాలురు 1,154 మంది హాజరుకాగా 596 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 2,026 మంది హాజరు కాగా 1,487 మంది ఉత్తీర్ణులయ్యారు. 891 మంది బాలికలు అధికంగా ఉన్నారు.

### కవిత్వంలో రాణిస్తున్న తిరుపతికి సత్కారం

ఇల్లంతకుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కవిత్వంలో రాణిస్తూ పలు బహుమతులు అందుకుంటున్న ముస్కానిపేట గ్రామానికి చెందిన తునికి తిరుపతిని గ్రామస్థులు గురువారం సత్కరించారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో తిరుపతి సాధిస్తున్న ఘనతను అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, ప్రకాష్, మల్లేశం, మహేష్, పున్నం రాజు, సింగిరెడ్డి మల్లారెడ్డి, రమణారెడ్డి, రాజయ్య, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### అధ్యాపక బృందం ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న అధ్యాపకులు

గంభీరావుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల మల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపక బృందం బాధిత కుటుంబాన్ని 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన సహాయకులు వరలక్ష్మి కుమారుడు నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితికి తమ వంతు చేయూతగా అధ్యాపక బృందం 10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఇచ్చిన వారిలో పాఠశాల హెచ్ఎం నర్సింగరావు, ఉపాధ్యాయులు శంకర్, లక్ష్మీనారాయణ, కనకయ్య, సత్యనారాయణ, రజని, పుష్పలత, ప్రమీల, స్రవంతి, శ్రీనివాస్, మనోహర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ


పూజలు చేస్తున్న చక్రవర్తుల పురుషోత్తమచార్యులు

చందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణమయ్యప్ప.. అయ్యప్ప దైవమే శరణమయ్యప్ప.. అంటూ శరణు ఘోష చందుర్తి మండల కేంద్రంలో మార్మోగింది. చందుర్తిలోని గచ్చుబావి వద్ద అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గుడెం గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమ చార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో వందలాది మంది అయ్యప్ప భక్తులు తరలివచ్చి స్వామివారి నామస్మరణ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం జరిపారు. అనంతరం పదునెట్టాంబడి వెలిగించారు. పడిపూజ మహోత్సవం సందర్భంగా అయ్యప్పస్వాములు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. ఆనంతరం అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం చేశారు. పలువురు నేతలకు అయ్యప్ప మాలదారణ స్వాములు ఘనంగా శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ చెల్కల తిరుపతి, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పొద్దుపొడుపు లింగారెడ్డి, నాయకులు సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, చిలుక అంజిబాబు, బైరగోని రమేష్, చిలుక పెంటయ్య, పులి సత్తయ్య, పొతరాజు నగేష్, గురుస్వాములు మేడిశెట్టి రాజు, రాజూరి రవిందర్, లింగాల లింగయ్య, మర్రి మల్లేశం, పొంచెట్టి సురేష్, అయ్యప్ప సేవా సమితి సభ్యుల, మాజి ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


పడిపూజలో పాల్గొన్న భక్తులు

### స్త్రీనిధి పథకంలో గేదెలు మంజూరు

కథలాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది మంది మహిళలకు స్త్రీనిధి పథకం కింద గేదెలు మంజూరైనట్లు సెర్ప్ ఏపీఎం నరహరి తెలిపారు. తాండ్ర్యాలకు చెందిన ఐదుగురు, గంబీర్‌పూర్‌లో నలుగురికి ఒక్కో యూనిట్ కింద రు. 93,340లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇన్సూరెన్స్ మూడు సంవత్సరాలు, ట్రాన్స్‌పోర్టు, దాణాకు నిధులు అందించనుందని చెప్పారు. గేదెలను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావాలనే నిబంధన ఉందని తెలిపారు. యూనిట్లను రెండు రోజుల్లో గ్రౌండింగ్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.